

ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి పీజీలో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. - 8లో



అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రభుత్వం అందించే ఉచిత చౌకబియ్యం జిల్లాలో అక్రమ నిల్వ ఉన్నా.. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కేసులు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 428 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేటి నుంచి ఇమ్యునైజేషన్ టీకా కార్యక్రమం

రాయచోటి : జిల్లాలో నేటి నుంచి 16వ తేదీ వరకు చేపట్టిన రెండోదశ ఇమ్యునైజేషన్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జేసీ, వైద్యాధికారులతో కలెక్టర్ కలిసి ఇమ్యునైజేషన్ టీకా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడటానికి టీకాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్/టౌన్ : జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ న్యాచురల్ ఫామింగ్(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ సూచించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను జేసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి చాలా మంచివని చెప్పారు. ప్రతి సోమవారం స్పందన రోజున కలెక్టరేట్‌లో స్టాల్ పెట్టనున్నట్లు తెలిపారు. దాదాపుగా 18నుండి 25 రకాల ఉత్పత్తులు రెండునుండి మూడు క్వింటాళ్ళవరకు అమ్మకం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీయస్ఎఫ్ జిల్లా మేనేజర్ రామక్రిష్ణంరాజు, రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

– జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ప్రజలు నమ్మకంతో వచ్చి అందజేస్తున్న ఫిర్యాదులను ప్రత్యేక చొరవతో పరిష్కార మార్గం చూపాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి స్పందన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వరం న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు.. స్పందనకు 36 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు.

తిరుపతి-జల్నా రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా నడుస్తున్న తిరుపతి-జల్నా-తిరుపతి (07413/14) రైలును రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. బీహార్‌లోని చాప్రా రైలు యార్డులో రీ మోడలింగ్ పనులు జరుగుతున్న కారణంగా ఈ రైలులను తిరుపతి-జల్నాల మధ్య ఈనెల 19, 26, అక్టోబరు 3, 10వ తేదీలలో రద్దు చేశారన్నారు. అలాగే జల్నా-తిరుపతి మధ్య ఈనెల 24, అక్టోబరు 1, 8, 15 తేదీలలో రద్దు చేశారన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి వారి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ నుంచి ఈనెల 28వ తేదిన అరుణాచల గిరి ప్రదర్శన కోసం తిరువన్నామలైకు పలు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు.కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు, రాత్రి 9 గంటలకు అరుణాచలానికి బస్సులు బయలుదేరుతాయన్నారు.అలాగే జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 9.15 గంటలకు, మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6.00 గంటలకు, రాత్రి 7 గంటలకు మరో సర్వీసు, బద్వేలు డిపోలోని పోరుమామిళ్లలో ఉదయం 5.00 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు, ప్రొద్దుటూరు డిపోనుంచి సాయంత్రం 7.45 గంటలకు తిరువన్నామలైకి బస్సు సర్వీసులు ఉన్నాయని వివరించారు. బయలుదేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటా ఆరోగ్య సురక్ష

- మరో బృహత్తర పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- ఈనెల 15 నుంచి ప్రతి ఇంటికి వలంటీర్
- 30 నుంచి ప్రతి మండలంలో హెల్త్‌క్యాంపులు
- ఉచితంగా వైద్య పరీక్షలు

జిల్లాలోని సచివాలయాలు	:501
పీహెచ్‌సీలు	:49
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	:375
అర్బన్‌హెల్త్ సెంటర్లు	:11



మదనపల్లెలోని బొమ్మనచెరువు పీహెచ్‌సీ

మదనపల్లె సిటీ : ప్రజలకు మెరుగైన,ఆధునాతన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖలో అనేక సంస్కరణలకు నాంది పలికింది. గ్రామీణులకు వారి చెంతనే వైద్య సేవలు అందేలా వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేసింది.పీహెచ్‌సీలను ఆధునిక హంగులతో తీర్చిదిద్ది, వైద్యులను నియమించింది. రోగుల వద్దకే వైద్యం అందించేలా 'ఫ్యామిలీ డాక్టర్'విధానాన్ని తీసుకొచ్చి పకడ్బందీగా అమలు చేస్తోంది. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'పేరిట మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఫలితంగా ప్రజలకు తమ గ్రామంలోనే మరింత ఆరోగ్య భరోసా దక్కనుంది.

అమలు ఇలా..

ప్రతి కుటుంబం ఆరోగ్య ఆవశ్యకతను, వారికి అవసరమైన వైద్య సేవలను గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఈనెల 15వతేదీ నుంచి గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించనున్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలపై సమగ్ర సమాచారం సేకరించి ఏఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు అందిస్తారు. 16వతేదీ నుంచి ఏఎన్ఎం, సీహెచ్ఎలు ఆయా కుటుంబాల్లోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వారి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స ఆవశ్యకత ఉంటే వెంటనే నియోజకవర్గ, జిల్లా స్థాయి ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో తప్పనిసరిగా మందులు సిద్ధం చేసుకుని మెడికల్ కిట్లు సైతం అందుబాటులో ఉంచుకోవాలని ఉన్నతధికారులు ఇప్పటికే ఆదేశించారు.

మండలాల్లో వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వతేదీ నుంచి మండలాల వారీగా మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తారు. ఇవి ప్రారంభం కావడానికి ముందే ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉంటాయి. రోగి పేరు నమోదు చేయగానే మొత్తం సమాచారం ప్రత్యక్షమవుతుంది. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, మరో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు అందుబాటులో ఉంటారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో గుర్తించిన రోగులకు ఆ రోజు వైద్యశిబిరంలో వైద్య సేవలు అందిస్తారు. అనువైన ప్రాంతాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయాధికారి, సమన్వయ కమిటీలో గ్రామ, వార్డు సచివాలయాలు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాధ్యత వహిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ,పీహెచ్‌సీ వైద్యులు, సీడీపీఓ, ఎంఈఓలకు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆయా రోజుల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు మౌలిక సదుపాయాలు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని సూచించింది.

దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక దృష్టి

వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్, గుండె ,కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తారు. బాలింతలు, చిన్నారులకు సంబంధించి శ్రద్ధ తీసుకుంటారు. వైద్యశిబిరాలకు ప్రత్యేక నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి సైతం స్పెషలిస్టు వైద్యులు హాజరవుతారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు పంపిణీ చేసేందుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తారు.

పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు



ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నెల 30 నుంచి గ్రామ స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. సమన్వయంతో పని చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు తెలియజేశాం. 15 నుంచి వలంటీర్లు ఇంటింటికి తిరిగి సమగ్ర ఆరోగ్య వివరాలు తెలుసుకుని నిర్దేశిత యాప్‌లో నమోదు చేస్తారు. గ్రామ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలు సమగ్రంగా యాప్‌లో పొందుపరుస్తారు.

– డాక్టర్ కొండయ్య, డీఎంహెచ్‌ఓ

మెగా క్యాంపులతో పేదలకు ప్రయోజనం



గ్రామ, వార్డు పరిధిలో ఈనెల 30 నుంచి ప్రారంభించే 'సురక్ష'ఎంతో ఉపయోగకరమైంది. ఈనెల 15 నుంచి వైద్య సిబ్బంది గడపగడపకు వెళ్లి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. వారికి శిబిరం నిర్వహణ వివరాలున్న టోకెన్ ఇస్తారు. మెగా క్యాంపులతో పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. శిబిరంలో పీహెచ్‌సీల ఇద్దరు వైద్యులు వైద్యులతో పాటు స్పెషలిస్టులు పాల్గొంటారు.

– డాక్టర్ లోకవర్ధన్, జిల్లా ప్రోగ్రాం అధికారి.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధరకాల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు.మాఢవీధుల్లో ఊరేగించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఊరేగింపులో స్థానికులు, కన్నడ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

15 నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి పవిత్రోత్సవాలు నిర్వమిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... ఏడాది పాటు స్వామి వారికి చేసే పూజల్లో , ఉత్సవాల్లో, తెలిసి తెలియక కలిగిన దోషాలను నివారించేందుకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారన్నారు. 15వ తేదీ అంకురార్పణతో పవిత్రోత్సాలు ప్రారంభమవుతాయన్నారు.16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతి, పవిత్ర విసర్జన ఉంటుందని తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 8న గాలివీడు మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలను శుక్రవారం లోపు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రజల నుంచి అందిన వినతులు..

గుర్రంకొండ మండలం, అమినీపల్లి గ్రామంలో పూర్వం నుండి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో హిందువులు, నిరుపేదలు, భూమిలేని వారు శ్మశాన వాటికను వాడుకునే వారని, ప్రస్తుతం దీనికి దారిని మూసివేశారన్నారు. సమస్యను పరిశీలించి శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. గాలివీడు మండలం, బోరెడ్డిగారిపల్లి సచివాలయ పరిధి పక్కిరారెడ్డిగారిపల్లిలోని బి చిట్టెమ్మ అంగవైకల్యం కలిగిన తన 10 సంవత్సరాల కుమారునికి వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. రాయచోటిలో నివాసం ఉండే యు బాలకృష్ణారెడ్డి రామాపురం మండలం, హసనాపురం గ్రామం, వెంకటరెడ్డిగారిపల్లెలో తనకు ఉన్న వ్యవసాయ భూములను రీసర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. బి కొత్తపేట మండలం, బడికాయలపల్లికి చెందిన బి రాజేశ్వరీ తనకు మంజూరైన ఇంటికి పునాది నిర్మించుకున్నానన్నారు. అందుకు సంబంధించి పునాది బిల్లు ఇంతవరకు మంజూరు కాలేదన్నారు. వెంటనే బిల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను పకడ్బందీగా చేపట్టాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 30వ తేదీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఈనెల 15వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు పంపిణీ చేయాలన్నారు. 16వ తేదీ నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారిని వైద్య శిబిరాలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో జగనన్న విద్యా దీవెన, జగనన్న తోడు కార్యక్రమాలకు సంబంధించి వందశాతం ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలు పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలి

ఏఎన్ఎంలు వారు పనిచేస్తున్న ప్రాంతంలో తప్పక నివాసం ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి హెల్త్ క్యాంపులకు సంబంధించిన వివరాలు వారికి తెలియజేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో పీహెచ్‌సీల వారీగా ఏఎన్ఎంలు ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే నివాసం ఉండాలన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యాశాఖాధికారి డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బొడ్డెపల్లె కృష్ణారావు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీని కలెక్టర్ అభినందించారు. అనంతరం వారు జిల్లాకు సంబంధించి పలు అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు.



టీడీపీ బంద్ విఫలం



రాయచోటిలోని నేతాజీ సర్కిల్ వద్ద మధ్యాహ్న సమయంలో వాహనాల రద్దీ

- బంద్‌కు సహకరించని ప్రజలు
- అన్ని డిపోల నుంచి యధావిధిగా తిరిగిన బస్సులు
- ఎలాం ఘటనలు చోటు లేకుండా పోలీసుల భారీ బందోబస్తు

సాక్షి రాయచోటి : స్కిల్‌స్కామ్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో బంద్‌కు పిలుపునిచ్చిన తెలుగుదేశం పార్టీ భంగపాటు ఎదురైంది. చంద్రబాబుకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పార్టీ అధిష్ఠానం పిలుపునివ్వగా ఎక్కడా కూడా ప్రభావం కనిపించలేదు. టీడీపీ శ్రేణులు కూడా రోడ్డుపై వచ్చేందుకు ఆసక్తి కనబరచలేదు. ఎక్కడికక్కడ కొంతమంది వచ్చిన తెలుగు తమ్ముళ్లు కూడా కేవలం పోలీసులు అదుపులోకి తీసుకునే వరకు ఉండడం, ఫోటోలు తీయగానే వెనుదిరగడం కనిపించింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు కూడా యదావిధిగా తిరిగాయి. ఎక్కడా కూడా దుకాణాలు మూతపడలేదు.

అంతంత మాత్రంగానే....

జిల్లాలో టీడీపీ బంద్‌కు తెలుగు తమ్ముళ్లు అంతంత మాత్రంగానే కనిపించారు. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ఒకటి, రెండుచోట్ల పోలీసులు అదుపులోకి తీసుకోగా, మిగిలిన ప్రాంతాల్లో రోడ్లపైకే రాలేదు. రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె, రైల్వేకోడూరు, తంబళ్లపల్లెలలో నేతలు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. బంద్‌ను పర్యవేక్షించే నాయకుడు కనిపించలేదు. రోడ్లపై వాహనాలు మొదులకొని యదావిధిగా పాఠశాలలు, మార్కెట్లు తెరుచుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తమ కార్యకలాపాలు కొనసాగించాయి.

అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె-1, 2, పీలేరు, రాయచోటి, రాజంపేట డిపోల పరిధిలో బస్సులు యదావిధిగా అన్ని ప్రాంతాలకు రాకపోకలకు సాగించాయి. జిల్లా వ్యాప్తంగా 448 బస్సులు ఉండగా, తిరుపతి, హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగుళూరు ఇలా దూర ప్రాంతాలతోపాటు మిగిలిన జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు కదిలాయి. ఎక్కడా కూడా బస్సులు, వాహనాలు అడ్డుకున్న దాఖలాలు కనిపించలేదు.

భారీ పోలీసు బందోబస్తు

టీడీపీ ఆందోళన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం భారీ బందోస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ కృష్ణారావు పర్యవేక్షణలో ఆర్టీసీ బస్టాండ్లు, సర్కిళ్లు, ఇతర ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వర్తించారు. పోలీసుల ముందస్తు చర్యలతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా చిన్నపాటి ఘటనలకు అవకాశం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

మట్టిగణపతితో పర్యావరణాన్ని కాపాడుకుందాం



వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీసుల ప్రత్యేక దృష్టి

రాయచోటి : పర్యావరణానికి ముప్పులేని మట్టి విగ్రహాల ఏర్పాటుపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి గ్రామ పరిధిలో వెలుస్తున్న వినాయకుని విగ్రహాల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రెవెన్యూ అధికారులతో కలిసి ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల్లో స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రంగులతో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి తెలియజేస్తున్నారు. మట్టితో విగ్రహాల తయారీపై కూడా పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు వాటి ఏర్పాట్లపై ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల కమిటీ సభ్యుల ఆధారాలను సేకరిస్తున్నారు. ఐకమత్యంగా, ప్రశాంతంగా పండగను చేసుకోవాలన్న సంకేతాలను అందిస్తున్నారు. ఇదే విషయంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి రాజంపేట మదనపల్లె సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో కూడా పలుమార్లు సమావేశాలు నిర్వహించి పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 13న జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు డ్రస్ కోడ్‌తో పాటు ఎలిజిబిలిటీ ఫాం తీసుకురావాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేసిన క్రీడాకారులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు వారి క్రీడాకారులను సిద్ధం చేసుకుని ఈనెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

యాదాద్రిలో ఎంపీ మిథున్‌రెడ్డి పూజలు



ఎంపీ మిథున్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి వెంకటేష్

యాదగిరిగుట్ట : ఎంపీ మిథున్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తెలంగాణలోని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభు, ప్రతిష్ఠ అలంకారమూర్తులకు పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం, ప్రొటోకాల్ అధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

గాయపడిన మహిళ మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె బస్టాప్ వద్ద ఈ నెల 10వ తేదీన జరిగిన ప్రమాదంలో దంపతులకు గాయాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తిరుపతిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతురాలి కుమారుడు వాసుదేవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అత్యాచార ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచార ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సీటీఎం పంచాయతీ గొల్లపల్లెమిట్ట గ్రామంలో ఓ మహిళపై గంగులప్ప అలియాస్ అప్పల్ల(50) ఈ నెల 9న అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

- బోధన, పరిశోధనలో మేటిగా వైవీయూ
- నేటి నుంచి ప్రవేశాలకు వెబ్ ఆప్షన్స్
- హెల్ప్ సెంటర్‌లు ఏర్పాటు



యోగివేమన యూనివర్సిటీ ముఖద్వారం

వైవీయూ : బోధనలోను, పరిశోధనలోనూ యోగివేమన విశ్వవిద్యాలయం ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన విశ్వవిద్యాలయం అనతికాలంలోనే అగ్రవిశ్వవిద్యాలయంగా వెలుగుతోంది. న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతోపాటు ఇటీవలే సైంటిఫిక్ ఇండెక్స్‌లో సైతం పలువురు వైవీయూ ఆచార్యులు చోటు దక్కించుకున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందే అవకాశం విద్యార్థుల ముంగిటకు చేరింది. మంగళవారం నుంచి పీజీలో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు లభించే విద్య, సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కథనం.

ప్రత్యక్ష పరిజ్ఞానం అందించే ప్రయోగశాలలు

విశ్వవిద్యాలయంలో తరగతులతోపాటు ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేస్తారు. భవిష్యత్తులో పరిశోధకులుగా రాణించాలంటే అవసరమైన పునాది పడేందుకు వేదికలు ప్రయోగశాలలే. వైవీయూలో ప్రతి సైన్స్‌కోర్సుకు అనుబంధంగా ప్రయోగశాలలు ఉండటం విశేషం. అదే విధంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో సైతం కోర్సుకు సంబంధించిన ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన లాంగ్వేజీ ల్యాబ్‌లు, ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి.

ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయం

విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం విద్యార్థులకు స్వాగతం పలుకుతుంది. ఇందులో దాదాపు 50,516 పుస్తకాలు, 20 వేల ఈ–జర్నల్స్ ఉన్నాయి.

పటిష్టమైన బోధన బృందం

విశ్వవిద్యాలయంలో దాదాపు 10 సెమినార్ హాల్స్ ఉండగా, దాదాపు ప్రతి గదిలోనూ డిజిటల్ బోధన అందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డుల సహాయంతో బోధన అందిస్తారు. 39 మంది ప్రొఫెసర్లు, 57 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 89 మంది అకడమిక్ కన్సల్టెంట్‌లతో పటిష్టమైన బోధన బృందం వైవీయూ సొంతం. దీంతోపాటు దాదాపు 40 జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంఓయూ కలిగి ఉండగా, 433 మంది పరిశోధకులు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు కొనసాగిస్తుండటం విశేషం.

వేమన ప్లేఫీల్డ్స్

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు కోసం సువిశాలమైన వేమన ప్లేఫీల్డ్స్ ఉన్నాయి. వ్యాయామవిద్య విభాగం ఆధ్వర్యంలో అధునాతన జిమ్‌సెంటర్, స్కేటింగ్ సెంటర్, రైఫిల్ షూటింగ్ అకాడమీలతోపాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన మైదానం, పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

వసతిగృహాలు

విశ్వవిద్యాలయంకు అనుబంధంగా బాలురకు 4, బాలికలకు 2 మొత్తం 6 వసతిగృహాలు ఉన్నాయి. బాలురకు చెయ్యేరు1, 2, పాపాఘ్ని 1, 2 వసతిగృహాలు ఉండగా, బాలికలకు పెన్నా, చిత్రావతి వసతి గృహాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించే భోజనశాలలు ఉన్నాయి.

హెల్ప్‌సెంటర్‌లు ఏర్పాటు

ఏపీపీజీసెట్–2023 ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి విద్యార్థులకు రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు విశ్వవిద్యాలయం రెండు ఉచిత హెల్ప్‌సెంటర్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. వైవీయూతోపాటు, కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో హెల్ప్‌సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వైవీయూ అధికారులు పేర్కొన్నారు.

ముఖ్యమైన తేదీలు	
వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్	12 నుంచి 20వ తేదీ వరకు
ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్	13 నుంచి 22వ తేదీ వరకు
వెబ్ ఆప్షన్స్	18 నుంచి 23వ తేదీ వరకు
సీట్ల కేటాయింపు	ఈ నెల 26
రిపోర్టింగ్	28 నుంచి అక్టోబర్ 3 వరకు
తరగతులు ప్రారంభం	అక్టోబర్ 5 నుంచి

జాబ్‌డ్రైవ్‌లు.. ప్లేస్‌మెంట్స్..

విశ్వవిద్యాలయంలో తరచుగా జాబ్‌డ్రైవ్‌లు నిర్వహించడంతో దాదాపు 80 శాతం మేర విద్యార్థులు కోర్సు పూర్తయిన వెంటనే ఏదో ఒక ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వైవీయూ అధికారులు పేర్కొంటున్నారు. వివిధ కంపెనీలు, సంస్థలతో ఉన్న ఒప్పందం మేరకు విద్యార్థులకు నైపుణ్యాలను అందించి ఉద్యోగాలు సాధించేలా చేయడంలో వైవీయూ ముందంజలో ఉందని చెప్పవచ్చు. పలువురు విద్యార్థులు విదేశాల్లో సైతం పరిశోధనలు కొనసాగిస్తూ ఆర్జిస్తుండటం విశేషం. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

ఆహ్లాదకర వాతావరణంలో విద్య



ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఒక చక్కటి ఆప్షన్. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. వైవీయూ పరిధిలో 28 విభాగాల్లోని కోర్సుల్లో ప్రవేశాలు పొందే అవకాశం విద్యార్థులకు ఉంది. ఇక్కడ విద్యనభ్యసించిన వారు దేశంలోని పలు ప్రాంతాలతోపాటు విదేశాల్లో సైతం ఉద్యోగాలు, పరిశోధనలు చేస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం.

– ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

మేడా భవన్‌లో ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేసి నేతలకు తినిపిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు (రాజంపేట) : మేడా భవన్‌లో సోమవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్‌ను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కట్ చేసి నేతలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. లోక్‌సభలో తనదైన శైలిలో ప్రజా సమస్యలపై గళం విప్పుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కృష్ణారావు యాదవ్, పట్టణ సచివాలయాల కన్వీనర్ వడ్డే రమణ, కూండ్ల రమణారెడ్డి, రాము యాదవ్, కటారు శేఖర్‌రెడ్డి, బీసీ నాయకులు వడ్డే శీను, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

కలకడ : ప్రభుత్వం అందించే ఉచిత చౌకబియ్యం, నిత్యావసర వస్తువులు జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వ ఉన్నా.. డీలర్లు కానీ, ఎండీయూ ఆపరేటర్లు కానీ అక్రమాలకు పాల్పడినా కేసులు తప్పవని కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కె.కొత్తపల్లె, కె.దొడ్డిపల్లె, గంగాపురం, కోన గ్రామాలలోని ప్రభుత్వ చౌకదుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు అందుబాటులో ఉండాలని, ఎండీయూ ఆపరేటర్ వాహనంతో రాగానే అన్ని నిత్యావసర సరుకులు అందజేయాలని ఆదేశించారు. ప్రతి చౌకధరల దుకాణంలో విధిగా చౌకదుకాణ ఆథరైజేషన్ ఉండాలని, మొత్తం కార్డులు, ఏఏవై కార్డులు, అన్నపూర్ణ కార్డులు, పీహెచ్‌సీ కార్డులు, నోటీస్ బోర్డులో రోజువారి స్టాక్ వివరాలు విధిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ బాల గంగాధర్‌రెడ్డి, సిబ్బంది నాగేశ్వర్‌రావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలుడి అర్జీపై స్పందించిన కలెక్టర్



సులేమాన్‌కు సెల్‌ఫోన్, ఇతర పరికరాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : దివ్యాంగ బాలుడి అర్జీపై జిల్లా కలెక్టర్ స్పందించారు. అతనికి ఉపయోగపడే పరికరాలు అందజేశారు. అన్నమయ్య జిల్లా జేకే రాజుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సులేమాన్‌కు విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కాలిపోయాయి. ఆగస్టు నెలలో రాయచోటి స్పందన కార్యక్రమంలో తనకు ఉపయోగపడే పరికరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి అర్జీ ద్వారా విన్నవించారు. సులేమాన్ పరిస్థితి చూసి స్పందించిన కలెక్టర్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ దీనిని స్వయంగా పర్యవేక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం స్మార్ట్ ఫోన్, చేతులు లేని వారు ఉపయోగించే స్మార్ట్ పరికరాన్ని కలెక్టర్ స్వయంగా అందజేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ)తో పని చేసే ఖరీదైన బయోనిక్ హ్యాండ్స్‌ను కూడా త్వరలోనే అందిస్తామని ఆయన తెలిపారు. తన పరిస్థితి చూసి ప్రభుత్వ పరంగా తనకు అవసరమైన పరికరాలను అందజేయడంలో చొరవ చూపిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు సులేమాన్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

మదనపల్లె : చైన్ స్నాచింగ్ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 9వ తేదీ రాత్రి పట్టణంలోని టీఎస్‌ఆర్ కాలనీకి చెందిన భారతి వాటర్‌క్యాన్ తీసుకుని వస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోని చైన్ దొంగలించి పారిపోయారు. ఘటనపై బాధితురాలి భర్త పెద్దిరెడ్డి తాలూకా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ రూ.15 వేల విలువ చేసే 4 గ్రాముల బంగారు చైన్ చోరీకి గురైనట్లు తెలిపారు. ఎస్‌ఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌డీపీఎల్ మద్యంపై నిఘా పెంచండి

మదనపల్లె : కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) మద్యం అక్రమ మార్గాల్లో ప్రవేశించకుండా ఎస్‌ఈబీ అధికారులు నిఘావ్యవస్థను పటిష్టం చేయాల్సిందిగా ఎస్‌ఈబీ మంగళగిరి డెప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. సోమవారం కర్ణాటక సరిహద్దులోని రామసముద్రం, చీకలబైలు ఎస్‌ఈబీ చెక్‌పోస్టులు, మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి, ఎస్‌ఐ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కర లేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు.

అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 90101 24073

కిడ్నాప్ కలకలం

- తనను కిడ్నాప్ చేశారంటున్న విద్యార్థి
- తర్వాత క్షేమంగా ఇంటికి..



బాధితుడు శ్రీనివాసులు

రాజంపేట రూరల్ : ఒక విద్యార్థిని కిడ్నాప్ చేసిన సంఘటన పుల్లంపేట మండలంలో కలకలం రేపింది. బాధిత విద్యార్థి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లంపేట మండలం అనంత సముద్రం, వత్తలూరు, తిప్పయపల్లి పంచాయతీలలోని విద్యార్థులు వత్తలూరు వడ్డిపల్లి–మల్లెంవారిపల్లి గ్రామాల మధ్య ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశిస్తున్నారు. ఆయా గ్రామాలలోని విద్యార్థులు రోజూ మూకుమ్మడిగా కాలినడకన, ద్విచక్రవాహనాలపై పాఠశాలకు వెళ్లడం జరుగుతుంది. అదే విధంగా పాపక్కగారిపల్లి దళితవాడకు చెందిన 9వ తరగతి చదువుతున్న నక్కల శ్రీనివాసులు సోమవారం ఉదయం అందరితో కాకుండా కొంచెం ఆలస్యంగా ఒంటరిగా సైకిల్‌పై ఉదయం 9 గంటల సమయంలో పాఠశాలకు బయలుదేరాడు. అయితే మార్గంమధ్యలో ఓ పొలం వద్ద కాపు కాసిన ఐదుగురు వ్యక్తులు శ్రీనివాసులకు మత్తు మందు ఇచ్చి ఒక వాహనంలో కిడ్నాప్ చేశారు. సాయంత్రం 3 గంటల సమయంలో విద్యార్థి శ్రీనివాసులు తండ్రి నాగయ్యకి సమీప గ్రామానికి చెందిన వ్యక్తి ఫోన్ చేసి మీ అబ్బాయి పుస్తకాల బ్యాగ్, సైకిల్ ఇక్కడ ఉంది అని సమాచారం ఇచ్చారు. ఆందోళన చెందిన నాగయ్య బంధువులకు విషయం తెలపడంతో గ్రామంలోని ప్రజలు ఆందోళనతో అక్కడికి చేరుకొని వెతకడం ప్రారంభించారు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో పొదలోపల్లి గ్రామ సమీపాన గల పొలాల మధ్య ఇటీవల నిర్మాణం చేపడుతున్న రహదారిలోని కల్వర్టుల కింద శ్రీనివాసులు ఉన్నట్లు గేదెల కాపరులు నాగయ్యకు సమాచారం ఇచ్చారు. శ్రీనివాసులును చేరుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. అనంతరం ఇంటికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు శ్రీనివాసులు విషయం తెలిపి గొంతులో, ఛాతిలో నొప్పిగా ఉందని తెలిపాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు గ్రామ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇండ్లూరి రంగారెడ్డికి సమాచారం ఇవ్వడంతో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు రాజంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి శ్రీనివాసులును తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. బాలుడి ఆరోగ్యం కుదుటగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సలహా ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఇది కిడ్నాప్ కాక పోవచ్చని, కేవలం డ్రగ్స్ మాఫియా పని అయి ఉండవచ్చని కొందరు అభిప్రాయ పడుతున్నారు. శ్రీనివాసులును కిడ్నాప్ చేయాల్సిన అవసరం ఎవరికీలేదని తెలియజేశారు. పోలీసులకు సనాచారం ఇచ్చామని, మంగళవారం ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. రెండు రోజుల క్రితం ఇదే తరహాలో ఓబులవారిపల్లి మండలం గాదెల గ్రామంలో ఒక యువతికి మత్తు మందిచ్చిన సంఘటన నెలకొంది. ఈ వరస సంఘటనల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన నాగరత్నమ్మ

మదనపల్లె : గ్యాస్ సిలిండర్ పేలి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ సిద్ధమ్మగారిపల్లెకు చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి వెంకటరమణ సోమవారం కొత్త సిలిండర్ తెచ్చి స్టవ్‌కు బిగించారు. ఆయన భార్య జి.నాగరత్నమ్మ(55) సాయంత్రం వంట చేస్తుండగా, సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి, సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో నాగరత్నమ్మకు తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.